క్లుప్తంగా

భక్తులను దోచుకుంటుంటే ఏమి చేస్తున్నారు.?

● ఉరుకుంద క్షేత్రం అధికారులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

మంత్రాలయం/ఆదోని రూరల్: ఉరుకుంద ఈరన్న క్షేత్రంలో భక్తులను దోచుకుంటున్న వైనంపై, అధిక ధరలకు టెంకాయలు విక్రయించడం, కల్యాణ కట్టలో గుండుకు రూ.100 అదనంగా వసూలు చేయడంపై 'సాక్షి'లో బుధవారం 'వసూళ్ల జాతర' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి సబ్‌కలెక్టర్ స్పందించారు. ఈ విషయంపై ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ బుధవారం క్షేత్రం అధికారులను సబ్ కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులను దోచుకుంటుంటే పట్టించుకోరా.. ఫిర్యాదుల వస్తే ఏమి చేస్తున్నారంటూ అధికారులను నిలదీశారు. ఇక నుంచి క్షేత్రంలో నిబంధనల ప్రకారమే విక్రయాలు, తలనీలాలు సమర్పణ సాగేలా చూడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్‌కు ఆదేశించారు. నియమాలకు విరుద్ధంగా నడుచుకునే కాంట్రాక్టర్లు, వ్యాపారులపై కేసులు పెట్టాలని సూచించారు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే ఆలయ అధికారులే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథకు కూడా ఫోన్ చేసి ఉరుకుందలో వసూళ్లు జరిగితే కేసులు నమోదు చేయాలని సూచించారు. నిబంధన ప్రకారం టెంకాయను కచ్చితంగా రూ.20కి విక్రయించేలా చూడాలన్నారు. తలనీలాల టిక్కెట్ రూ.40కి మించి వసూళ్లకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్‌తోపాటు ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు ఉన్నారు.

పెద్దతుంబళం ఎస్ఐగా మహేష్ కుమార్



ఆదోని రూరల్: పెద్ద తుంబళం ఎస్ఐగా డి.మహేష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తాను పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్ నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

హర్ ఘర్ తిరంగా



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి







కోసిగిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ మెయినుద్దీన్, నందవరంలో విద్యార్థుల ర్యాలీ, ఆదోనిలో జాతీయ జెండాతో లవ్ సింబల్ ఆకారం



ఎమ్మిగనూరు పట్టణంలో వంద మీటర్ల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



గోనెగండ్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



బల్లేకల్లు గ్రామంలో 100 అడుగుల జెండాతో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు



కౌతాళంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో డీఈ, ఏఈలు, అంగన్‌వాడీలు, మెప్మా ప్రాజెక్టు అధికారులు, పొదుపు సంఘాల మహిళలు, ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు తదితరులు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్ భీమా రీజెన్సీ వద్ద జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం బల్లెకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు 100 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ చేపట్టారు. హెచ్ఎం బి. సత్యన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన 120 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. భాష్యం పాఠశాల హెచ్ఎం కృష్ణవేణి, సహాయ ప్రధానోపాధ్యాయుడు అంజి ఆధ్వర్యంలో విద్యార్థులు విన్యాసాలు ప్రదర్శించారు.

ఆదోని అర్బన్: ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీలు నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, ఎర్రిస్వామి వీరేష్, ఉమేష్ తదితరులు పాలొన్నారు.

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎంఈఓ మెయినుద్దీన్ విద్యార్థులతో కలసి జాతీయ జెండాలను పట్టుకుని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ, స్కౌంట్స్ అండ్ గైడ్ విద్యార్థులు, మున్సిపల్, మెప్మా సిబ్బంది వంద మీటర్ల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ గంగిరెడ్డి ర్యాలీని ప్రారంభించారు.

ఎమ్మిగనూరురూరల్: స్థానిక భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టౌన్ సీఐ సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, తహసీల్దార్ శేషఫణి, డీటీలు శ్రీదేవి, జ్యోతిర్మయి, ఆర్ఐ, వీఆర్వోలకు జాతీయ జెండాలను అందజేసి స్వాతంత్ర శుభాకాంక్షలను తెలియజేశారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాతో ర్యాలీ చేశారు.

నందవరం : ప్రతి ఒక్కరూ దేశభక్తితో నిస్వార్థంగా సేవ లందించినప్పుడే నిజమైన స్వాతంత్ర్య ఫలాలు లభిస్తాయని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎంఈఓ రఘునాథ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శివరామ్ ఆధ్వర్యంలో మండల అధికారులు 2కే రన్ ర్యాలీ ప్రారంభించారు. మానవ హారంగా నిలిచి నినాదాలు చేశారు.



ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్: మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హాజరై మాట్లాడారు. ఆదోని డివిజన్ పరిధిలోని వాల్మీకులు చదువులో చాలా వెనుకంజలో ఉన్నారన్నారు. రాజకీయంగా, అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే చదువుతోనే సాధ్యమన్నారు. సంపాదించిన డబ్బుతో వృథా ఖర్చులు చేయకుండా బిడ్డల చదువులకు ఉపయోగించాలని, వాల్మీకులు పల్లకీలో ఎక్కి తిరిగేగా తయారు కావాలన్నారు. మీకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. అంతకముందు వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల వరకు యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్ట, కక్ష జ్వాల గోదర్శన, బలి ప్రధానం, పూర్ణాహుతి, కలస ఉద్వాసన, మహామంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వాల్మీకి కుల పెద్దలు, వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా




కార్యకర్తలతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం సజ్జలగుడ్డం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కురువ లింగన్న స్వగృహంలో పూజా కార్యక్రమానికి ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. అనంతరం కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో లేదని ఎవరు నిరాశ చెందొద్దన్నారు. అధికారంలో ఉన్నా లేక పోయిన కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. అర్ధరాత్రిలో సైతం ఫోన్ చేసినా స్పందించి వారి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మహంతేష్ స్వామి, దశరథ రెడ్డి, బసిరెడ్డి, మల్లికార్జు గౌడ, తుంబిగనూరు సర్పంచ్ వారం ఈరన్న పాల్గొన్నారు.

ఈరన్నస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే..

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామిని బుధవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, తిరుపతి దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ సీతారాంరెడ్డిలు కుటుంబ సమేతంగా తరలివచ్చి దర్శించుకున్నారు.దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అలాగే శ్రావణమాస ఏర్పాట్లపై కమిషనర్‌తో చర్చించారు.





X CLASS KIDDY'S ROOTS MARKS ANALYSIS

MARKS	TOTAL	PERCENTAGE
597	1	0.4
596 & above	4	1.7
595 & above	9	3.8
590 & above	28	11.8
580 & above	70	29.5
570 & above	105	44.3
560 & above	119	50.2
550 & above	142	59.9
500 & above	195	82.3

శ్రీ మఠానికి మూడు వేల మొక్కల విరాళం



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో పీ.వీ బద్రీనాథ్‌రావు

పాణ్యం: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి పాణ్యం గ్రామానికి చెందిన పీవీ బద్రీనాథ్‌రావు మూడువేల మొక్కలు విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. పాణ్యంలోని తమ నర్సరీ నుంచి పూల, అలంకార, పండ్ల మొక్కలను అందజేశామన్నారు. వీటితో పాటు ల్యాండ్‌స్కేపింగ్ మొక్కలు కూడా అందించామని చెప్పారు. వీటి విలువ దాదాపుగా రూ. 8లక్షలు ఉంటుదన్నారు. బద్రీనాథ్‌రావును మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీర్వదించారు.

శ్రీమఠంలో హరికథామృతసార పారాయణం

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రాఘవేంద్రస్వామి మఠంలో హరికథామృతసార పారాయణం గావించారు. బుధవారం గురుసార్వభౌమ సాహిత్య మండలి సభ్యులతో నిర్వహించిన పారాయణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దాస సాహిత్యం, హరికథలకు హిందూ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉందని పండితుడు వాదీరాజాచార్ తెలిపారు. దాససాహిత్య మండలి సభ్యుడు హనుమేషాచార్, మహిళలు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మఠం గిరిజ



ఆదోని అర్బన్: ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా మఠం గిరిజను నియమిస్తూ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తన ఎంపికకు సహకరించిన పెద్దలు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, జిల్లాధ్యక్షులు కునిగిరి నీలకంఠకు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదోని జంగమ మరియు వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

ఆదోని టౌన్: డ్రగ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ స్థానిక కార్యాలయ ఆవరణలో మున్సిపల్ సిబ్బందితో కలిసి డ్రగ్స్ ఫ్రీ ఇండియా అని ప్రతిజ్ఞ చేయించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పోస్టాఫీస్ లైన్‌తో పాటు సోమప్ప సర్కిల్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం శివన్న నగర్ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు పనులను పరిశీలించి రోడ్డు పనులు సక్రమంగా చేయాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. కార్యక్రమంలో ఏఈ మదన్‌కుమార్ పాల్గొన్నారు.

రౌడూరుకు బస్సు నడపండి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామం మీదుగా రౌడూరు గ్రామానికి బస్సు నడపాలని సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మించి ఏడాది గడిచినా ఆర్టీసీ బస్సు నడపక పోవడంతో విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ముగిసిన రోప్ స్కిప్పింగ్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులతో తహసీల్దార్ శేషఫణి, ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరురూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఈ. పద్మావతి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన రీజినల్ స్థాయి ఇండియన్ రోప్ స్కిప్పింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన రోప్ స్కిప్పింగ్ కీడ్రల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని 22 నవోదయ విద్యాలయాల నుంచి 141 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనగా 30 (15 మంది బాలురు, 15 మంది బాలికలు) మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు సెప్టెంబర్ 3 నుంచి కర్ణాటక లోని హసన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ చందీరన్, బసవరాజు, ఎర్రిస్వామి, శ్రీలక్ష్మి, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి చెందిన ప్రియాంక అనే వివాహిత కుటుంబ కలహాలతో పురుగు మందు సేవించి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అలాగే కోసిగి మండలంలోని కోల్మన్‌పేట గ్రామానికి చెందిన గోవింద్ కుటుంబ కలహాలతో బుధవారం పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మండలంలోని కడితోట గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం ఉరుకుంద పుణ్యక్షేత్రం నుంచి వాల్మీకినగర్‌కు చెందిన హనుమక్క, తిమ్మక్క ఆదోనికి వస్తుండగా కడితోట గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడటంతో గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే వారిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

17న విద్యాసంస్థల బంద్

కోసిగి: మంత్రాలయం మండలం రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థిని పార్వతి మృతికి నిరసనగా ఈనెల 17న మంత్రాలయం నియోజకవర్గ పరిధిలో విద్యా సంస్థలను బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, తాలూకా కార్యదర్శి రాజు తెలిపారు. బుధవారం కోసిగిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘం మండల కార్యదర్శి అంజి ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశమయ్యారు. నాయకులు నబి, హనుమంతు, నాయుడు, బడేసాబ్, విజయ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు సాగునీటిని విడుదల చేయాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, ముగతి సర్పంచ్ విరూపాక్షిరెడ్డి కోన్నారు. బుధవారం స్థానిక ఎల్ఎల్‌సీ కార్యాలయంలో ముగతి రైతులతో కలసి డీఈకి వినతి పత్రం అందజేశారు. కెనాల్‌పై పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఆంధ్రకు రావాల్సిన వాటా అందేలా చూడాలన్నారు. రైతులు సోమశేకర్‌రెడ్డి, హనుమంతు, మాణిక్యం, అయ్యప్పరెడ్డి, జయరాం తదితరులు ఉన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

ఆదోని రూరల్: కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లా వరద బాధితుల సహాయార్థం ఆదోని పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం విరాళాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా ఆదోని తహసీల్దార్ శివరాములు మానవత్వంలో విరాళం అందించారు. సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

పెద్దకడబూరు : వాల్మీకీ బోయలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ప్రధానకార్యదర్శి చిన్న నరసప్ప డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు మహేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

వీధి వ్యాపారులకు రుణాలు

ఎమ్మిగనూరుటౌన్: పురపాలక సంఘ పరిధిలో తోపుడుబండ్లు, రోడ్డు మీద చిరువ్యాపారాలు చేసుకునేవారు, కాలినడకన అమ్ముకునే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తారని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి బుధవారం తెలిపారు. రుణాల కోసం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి

నందవరం : జాబ్‌కార్డు ఉన్న ప్రతి రైతును ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సహించాలని ఏపీడీ అల్లిపీర సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో ఉపాధి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. రైతులను ఉద్యాన పంటలైన కొబ్బరి, మునగ, పూలు, పండ్లతోట పెంపకంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.







